క్లుప్తంగా

సీఐగా నాగబాబు బాధ్యతలు స్వీకరణ



డీఎస్పీకి మొక్క అందజేస్తున్న సీఐ నాగబాబు

మణుగూరురూరల్: మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పాటి నాగబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేసిన ఎస్.సతీష్‌కుమార్ సస్పెండ్ కాగా.. ఆయన స్థానంలో మహబూబాబాద్ ట్రాఫిక్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ పాటి నాగబాబు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సీఐ నాగబాబు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నూతన సీఐ నాగబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవం

చండ్రుగొండ: మండలంలోని మంగయ్యబంజర్ గ్రామంలో బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ముత్తకేశ్వరి ముత్యాలమ్మ, పోతురాజు తత్ పరివార దేవతా స్థిర ప్రతిష్ఠామహోత్సవం జరిపించారు. పండితుల వేద మంత్రోత్సరణ నడుమ వందలాది మంది వీక్షిస్తుండగా క్రతువు ఘనంగా జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు

ములకలపల్లి: వ్యక్తుల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందేందుకు క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మాజీ సర్పంచ్ కారం సుధీర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గుంపుల రవితేజ అన్నారు. గ్యాంగ్‌వార్ ఆధ్వర్యంలో తాళ్లపాయలో ఏర్పాటు చేసిన మండల స్థాయి వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ముత్యాలంపాడు, జిన్నెలగూడెం, రింగిరెడ్డిపల్లి గ్రామాల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి, మడకం చిరుమప్ప, ప్రవీణ్ పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయాలి

అశ్వాపురం: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి సీపీఐ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్యాచారి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ మండల కార్యవర్గ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని గ్రామ శాఖల సమావేశాలు నిర్వహించి జూన్ 27న జరిగే మండల మహాసభను జయప్రదం చేయాలన్నారు. పార్టీ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి అనంతనేని సురేష్, నాయకులు సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వీరన్న, వెంకటనరసయ్య, పవన్‌సాయి, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

చర్ల: సబ్సిడీపై రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పరుచూరి రవికుమార్ కోరారు. సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సబ్సిడీ విత్తనాల విక్రయాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా రైతులకు సబ్సిడీపై అందజేసే జీలుగ, వరి విత్తనాలను రైతులు సకాలంలో తీసుకోవాలని ఆయన కోరారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సులను వ్యవసాయశాఖ అధికారులకు చూపించి కూపన్లు తీసుకుని వచ్చి కొనుగోలు చేయాలని అన్నారు. వ్యవసాయశాఖ అధికారి లావణ్య, సహకార సంఘ సీఈఓ ఎస్‌డీ.జిలానీ, రైతులు పాల్గొన్నారు.

జూన్ 8న మాలల ఆత్మీయ సమ్మేళనం

భద్రాచలంటౌన్: జిల్లాలోని మాలలను ఐక్యం చేస్తూ జూన్ 8న నిర్వహించే మాలల ఆత్మీయ సమ్మేళనం, మహా జాతర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం జరిగిన మాలల ఆత్మీయ సమ్మేళనం, మహా జాతర కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే మాలల ఆత్మీయ సమ్మేళనంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలలో పిల్లలు, పెద్దలు అందరూ కలిసి పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పౌల్‌రాజ్, గంధం కల్పన, గౌతమ్, స్వర్ణలత, శ్రీకాంత్, రవివర్మ, మూర్తి, శివ, శ్రవణ్, నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం.. పరిహాసం

- 'సీతారామ' ప్రధాన కాలువకు నాడే భూములు సేకరణ
- ఐదేళ్లుగా అందని పరిహారం
- నేడు పిల్ల కాలువల భూసేకరణకు అధికారుల యత్నం
- గిరిజనుల నుంచి పెల్లుబికిన వ్యతిరేకత

దమ్మపేట: సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నిమిత్తం భూములను ఇచ్చిన గిరిజన రైతులకు గత ఐదు సంవత్సరాల నుంచి పరిహారం చెల్లించకుండా, ప్రస్తుతం ప్రధాన కాలువ నుండి పిల్ల కాలువల నిర్మాణానికి చేస్తున్న భూమి సేకరణను గిరిజన రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

గ్రామ సభ తిరస్కరణ

ఇదిలా ఉండగా ప్రధాన కాలువకు పరిహారం చెల్లించకుండానే, ప్రధాన కాలవ నుండి పిల్ల కాలువల నిర్మాణ నిమిత్తం, భూమి సేకరణకు జగ్గారం రెవెన్యూ పరిధిలో అధికారులు ప్రయత్నించడం



గ్రామ సభలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్న గిరిజన నాయకులు (ఫైల్)

పట్ల గిరిజన రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని జగ్గారం గ్రామ పంచాయితీ పరిధిలో సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నుండి పిల్ల కాలువలు నిర్మాణానికి 43 ఎకరాల భూసేకరణ నిమిత్తం గ్రామపంచాయతీ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో ఇటీవలే గ్రామ సభను నిర్వహించారు. ఈ సభకు జగ్గారం, బూరుగుగుంపు, గుర్వాయిగూడెం, చెన్నువారిగూడెం, టీ.ఎం.గుంపు గ్రామాలకు చెందిన గిరిజనులు హాజరై మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో పెసా సభను ఏర్పాటు చేయాల్సి ఉండగా గ్రామసభను ఏర్పాటు చేయడం పట్ల అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన కాలువ కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించకుండా, తిరిగి పిల్ల కాలువల పేరుతో భూసేకరణకు ఎలా వచ్చారంటూ అధికారులను నిలదీశారు. ఐదు సంవత్సరాల క్రితం భూ నిర్వాసిత రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు 8 లక్షల రూపాయల పరిహారం, ప్రస్తుత మార్కెట్ ధరలతో కలిపి ఒక ఎకరాకు 24 లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత మాత్రమే పిల్ల కాలువల భూ సేకరణకు గ్రామసభను నిర్వహించాలని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులంతా ఏకాభిప్రాయంతో గ్రామ సభను తిరస్కరిస్తున్నామని తీర్మానించారు.

గణాంకాల్లో అత్యుత్సాహం..

సీతారామ ప్రాజెక్టు పిల్ల కాలువల వలన గ్రామాల్లో సాగులోకి వచ్చే వ్యవసాయ భూమి విస్తీర్ణాన్ని అధికారులు గణాంకాల పరంగా అధికంగా చూపుతున్నారని, ఆ మేరకు నివేదికలు రూపొందించారని గిరిజన నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పిల్ల కాలువల వల్ల భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ, సాగు అయ్యే ఎకరాల సంఖ్యలో మాత్రం వాస్తవం ఉండట్లేదని ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత అధికారులు మరోసారి సాగు అయ్యే భూ విస్తీర్ణంను సంబంధించిన నివేదికను కచ్చితత్వంతో రూపొందించాలని గిరిజనులు కోరుతున్నారు.



భూములు కోల్పోయిన తీరిది..

సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ నిమిత్తం మండలంలోని జగ్గారం రెవెన్యూ పరిధిలో 2019 సంవత్సరంలో గ్రామసభల ద్వారా 103 ఎకరాల 7 కుంటల భూమిని 127 మంది రైతుల నుంచి సేకరించారు. భూమిని కాలువకు ఇచ్చిన రైతుల్లో దాదాపుగా గిరిజనులే ఉన్నారు. ఇందు నిమిత్తం రికార్డు ప్రక్రియ పూర్తిచేసిన అనంతరం భూమిని కోల్పోయిన రైతులకు త్వరలోనే ఎకరానికి 8 లక్షల రూపాయల మేరకు పరిహారం చెల్లిస్తామని గత బీఆర్ఎస్ హయాంలో అధికారులు సభాముఖంగా ప్రకటించారు. భూ సేకరణ ప్రక్రియ అనంతరం రెవెన్యూ రికార్డుల్లో రైతుల పేర్లను తొలగించి, సీతారామ ప్రాజెక్టు పేరును నమోదు చేశారు. ఈ ప్రక్రియ అంతా జరిగి నేటికి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా.. ఇప్పటివరకు ఆ గిరిజన రైతులకు పరిహారం అందకపోవడం తీవ్ర చర్చాంశనీయంగా మారింది. ఒక పక్క పరిహారం అందకపోగా మరోపక్క ఈ ఐదు సంవత్సరాలు కాలానికి రైతు బంధు ఆర్థిక సహాయాన్ని కూడా గిరిజనులు కోల్పోయారు. దీనిపై గిరిజనులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెసా కమిటీలు ఏర్పాటు చేయాలి

గిరిజన ప్రాంతాల్లో తక్షణమే పెసా కమిటీలను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రధాన కాలువ నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించకుండా, పిల్ల కాలువలకు భూ సేకరణకు ప్రయత్నించడం హాస్యాస్పదంగా ఉంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరిహారం విషయంలో కలుగజేసుకుని, గిరిజనులకు న్యాయం చేయాలని కోరుతున్నా.

– కారం శ్రీరాములు, గిరిజన నాయకుడు

ఉన్నతాధికారులకు నివేదించా..

జగ్గారం రెవెన్యూ పరిధిలోని సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ నిర్వాసితులకు ఇంకను పరిహారం అందకపోవడం వాస్తవమే. దీనిపై తగు నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేశాను. వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యంతోనే పిల్ల కాలువలకు భూ సేకరణ చేస్తున్నాం. మరోమారు జగ్గారంలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభను ఏర్పాటు చేస్తాం.

– కృష్ణ, ఇరిగేషన్ డీఈ

'పేరాయిగూడెం'లో తాగునీటి వ్యథ



పేరాయిగూడెంలో ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని పేరాయిగూడెం గ్రామంలో తాగునీటి కష్టాలు నెలకొన్నాయి. మూడు రోజుల క్రితం గ్రామంలోని తాగునీటి మోటారు మరమ్మతులకు గురి కాగా.. తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దాంతో గ్రామస్తులు గడిచిన మూడు రోజులుగా తాగునీరు కోసం అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలోనే మున్సిపాలిటీ ద్వారా రోజుకు ఒక ట్యాంకరు ద్వారా తాగునీటిని సరఫరా చేస్తుండగా, ఈ నీళ్ల సరిపోక స్థానికులు అవస్థలు పడాల్సి వస్తోంది. దీంతో స్థానికులు ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లపై అశ్వారావుపేటకు వచ్చి తాగునీరు తీసుకెళ్లి కాలం వెళ్లదీస్తున్నారు. తక్షణమే మోటారుకు మరమ్మతులు చేయించి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా, బుధవారం మధ్యాహ్నం స్థానిక మున్సిపాలిటీ సిబ్బంది మరమ్మతులకు గురైన మోటారును తొలగించి రిపేర్‌కు తరలించారు. దీనిపై మున్సిపాలిటీ అధికారుల వివరణ కోసం 'సాక్షి' ప్రయత్నించగా, అందుబాటులో లేరు.

సాగులో మెళకువలపై అవగాహన



కరపత్రాలను ప్రదర్శిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

దమ్మపేట: ఉద్యాన, వ్యవసాయ సంబంధిత పంటల సాగులో అధిక దిగుబడి సాధించడానికి అవసరమైన మెళకువలను అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి, రైతులకు సమగ్రంగా వివరించారు. బుధవారం మండలంలోని గణేష్‌పాడు గ్రామంలో అభ్యుదయ రైతు పూర్ణచంద్రరావు పామాయిల్ తోటను శాస్త్రవేత్తలు, అధికారులు పరిశీలించారు. అనంతరం అదే గ్రామంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. పామాయిల్‌లో అంతర పంటలు, పంట మార్పిడి, ఉద్యాన శాఖ ద్వారా అందజేస్తున్న రాయితీలు తదితర అంశాల గురించి వివరించారు. అశ్వారావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు రవికుమార్ మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, విత్తనాలు కొన్న రశీదును భద్రపరచుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. ఎంపీడీఓ రవీంద్రా రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక విషయాల పట్ల అవగాహన పెంచుకుని, అధిక దిగుబడి సాధించేలా ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయానికి శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జంబమ్మ, శిరీష, ఏఈఓ వినోద్, కార్యదర్శి విజయ, రైతులు ఎర్రగొర్ల రాంబాబు, మద్రి కుటుంబరావు, కనసాని గోపి, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు అడ్డంగా గోడ



సీసీ రోడ్డుకు అడ్డంగా కట్టిన గోడ..

ములకలపల్లి: ప్రభుత్వ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును, తమ పట్టాభూమిలో కట్టారంటూ పట్టాదారులు అడ్డంగా గోడ కట్టారు. ములకలపల్లి బస్టాండ్ సెంటర్‌కు అత్యంత సమీపంలోని గ్రోమోర్ షాపు ఎదుట ఏడేళ్ల క్రితం అంతర్గత సీసీ రోడ్డు వేశారు. స్థానికులు ఇదే రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తున్నారు. ఇదిలాఉండగా, తమ పట్టా భూమిలో రోడ్డు వేశారంటూ పట్టాదారులు కోర్టును ఆశ్రయించారు.

కొంత కాలంగా వివాదం..

ఈ క్రమంలో పట్టాదారులు సుమారు ఆరు నెలల క్రితం రోడ్డుకు అడ్డంగా మట్టికుప్పలు వేశారు. ఈ తరుణంలో ఆ ప్రదేశంలో భారీగా మురుగు పేరుకుపోయింది. స్థానికులు చెత్తాచెదారం వేయడంతో మురికికూపంలా మారింది. ఈ ఉదంతంపై పత్రికల్లో కథనాలు రావడంతో సంబంధితశాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. వారం రోజుల క్రితం మురుగు నిల్వ ప్రదేశంలో కాలువ తవ్వి, తాత్కాలికంగా డ్రెయినేజీ ఏర్పాటు చేశారు. రోడ్డుకు అడ్డంగా వేసిన మట్టికుప్పలను తొలగించి, రాకపోకలు పునరుద్ధరించారు. ఇదిలా ఉండగా, బుధవారం పట్టాదారులు సీసీ రోడ్డుకు అడ్డంగా సిమెంట్ ఇటుకలతో అడ్డుగా గోడ నిర్మించడం గమనార్హం.

నిర్వాసితులకు చెక్కులు అందజేత



రైల్వే ట్రాక్ బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: కాంగ్రెస్ పార్టీ ప్రజల ప్రభుత్వమని అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్ ఉంటుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ప్రజాభవన్‌లో బీటీపీఎస్ రైల్వేట్రాక్‌లో భూములు కోల్పోయిన గాంధీనగర్, కాళీమాత ఏరియా, భగత్‌సింగ్‌నగర్, శేషగిరినగర్‌కు చెందిన పెండింగ్‌లో 24 మంది చెక్కులను నిర్వాసితులకు అందజేశారు. ఒక్కొక్కరికి రూ.5.50లక్షల చొప్పున రూ.1.32కోట్ల విలువైన ఈ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. భూములు కోల్పోయినప్పటికీ అనివార్య కారణాలతో చెక్కులు రాని బాధితులు తనను సంప్రదించడంతో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పరిహారం ఇప్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అద్దంకి నరేశ్, మండల కాంగ్రెస్ నాయకులు నవీన్, శివ, సౌజన్య, సతీష్, బాబు, నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరేణి జాగృతి కోఆర్డినేటర్ నియామకం



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అశోక్

మణుగూరుటౌన్: సింగరేణి జాగృతి మణుగూరు ఏరియా కో–ఆర్డినేటర్‌గా అజ్మీరా అశోక్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. కొండాపురం భూగర్భగనిలో జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అశోక్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో తెలంగాణ జాగృతి గౌరవ అధ్యక్షురాలు కవిత సింగరేణి జాగృతి మణుగూరు ఏరియా కో–ఆర్డినేటర్‌గా నియమించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

దేవస్థానం భూముల కౌలు వసూళ్లు



రైతు ఇంటి వద్ద కౌలు వసూలు చేస్తున్న దేవస్థానం సిబ్బంది

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి అగ్రహారంగా ఉన్న భూముల కౌలు వసూళ్లకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ ఆధ్వర్యంలో రైతుల ఇళ్లకు వెళ్లి కౌలు బకాయిలు వసూలు చేశారు.

అంజుశ్రీకి సీఎం అభినందన



ప్రశంసాపత్రం చూపిస్తున్న గొడ్ల అంజుశ్రీ

ములకలపల్లి: రాష్ట్ర క్రీడాపోటీల్లో ప్రతిభ చూపిన ములపలపల్లి గురుకుల విద్యార్థిని గొడ్ల అంజుశ్రీని ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి అభినందించారు. హైదరాబాద్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ప్రిన్సిపాల్ సునీత, సిబ్బంది అభినందించారు.

విత్తనాల దుకాణాల్లో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

అశ్వారావుపేటరూరల్: ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో పోలీస్, వ్యవసాయ శాఖ సంయుక్తంగా బుధవారం పలు విత్తనాల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అశ్వారావుపేటలోని మన గ్రోమోర్ సెంటర్‌లో రైతులకు విక్రయించేందుకు ఉంచిన పత్తి, మొక్కజొన్న విత్తనాలను పరిశీలించి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ పింగళి నాగరాజు రెడ్డి మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదని, వ్యవసాయ శాఖ ఆదేశాలను దుకాణాలదారులు పాటించాలని అన్నారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఏఓ శివరాంప్రసాద్, ట్రైనీ ఎస్సై అఖిల, ఏఈఓ సతీష్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఐక్యవేదిక సమావేశం



సమావేశంలో పాల్గొన్న జర్నలిస్టులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని హరిత హోటల్‌లో భద్రాచలం జర్నలిస్టుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మీడియా హక్కులను అడ్డుకునే అధికారం ఎవ్వరికీ లేదని, అధికారులు అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో పూనెం ప్రదీప్ కుమార్, మోబగాపు ఆనంద్, తోట మల్ల బాలయోగి, పిల్లిరాజు, తోకల నాగేశ్వరరావు, పోకల శ్రీనివాస్, తమ్మళ్ళ రాజేష్ మురళి, రేపాక రామారావు, సంతోష్, రామాచారి, బాల కిరణ్, భూక్య రంజిత్, సాయి కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



దమ్మపేట: మండలపల్లిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న నాయకులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతిని బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు టీడీపీ శ్రేణులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పలువురు మాట్లాడుతూ.. విశ్వవిఖ్యాత నటుడిగా, పరిపాలనాదక్షుడిగా ఎన్టీ రామారావు ప్రజలకు విశేష సేవలందించారని, వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆ మహనీయుడి ఆశయాల సాధనకు ఐక్యంగా కృషి చేయాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్

నిర్మాణాల భవిష్యత్ ప్రశ్నార్థకం

- నాసిరకం ఇసుక, కంకర వినియోగం
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పర్యవేక్షణ మరిచిన అధికారులు



రాత్రివేళ ట్రాక్టర్లతో అన్‌లోడ్ చేసిన వాగుల్లోని ఇసుక

మణుగూరుటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెలకు మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజల సమస్యలు పరిష్కరించాలనే సంకల్పంతో వివిధ విభాగాల నిధులు విడుదల చేస్తుంటే.. అవి ఎంతకాలం ఏజెన్సీ వాసులకు అక్కరక వస్తాయి అనేది ప్రశ్నార్థకం. రూ.కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నిర్మాణాలకు నాసిరకం కంకర, వాగుల్లో లభ్యమయ్యే ఇసుకను వినియోగించడమే ఇందుకు తార్కాణం.

నిర్మాణాలపై పర్యవేక్షణేది?

మున్సిపాలిటీలోని భగత్‌సింగ్‌నగర్, శివలింగాపురంల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తాగునీటి కొరత తీర్చేందుకు రూ.3 కోట్ల మేర 16 లక్షల లీటర్ల చొప్పున వాటర్ ట్యాంకుల నిర్మాణం పబ్లిక్ హెల్త్ విభాగం నిధులతో చేపట్టింది. ఇటీవలే స్థానిక శాసన సభ్యుడు శంకుస్థాపన చేసినప్పటికీ ఆది నుంచి నిర్మాణాల్లో సీతారామ కెనాల్ అనుమతి లేని క్రషర్ నుంచి ఎటువంటి నిర్మాణాలకు పనికిరాని నాసిరకం కంకర రాత్రివేళల్లో దిగుమతులు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఫ్లేక్ మెటల్ నే సరైన మెటల్‌గా చూపేందుకు పగలు దిగుమతులు ఆపివేసి అర్ధరాత్రివేళల్లో పట్టణంలో పెద్ద నిర్మాణాల వద్ద రాత్రిళ్లలో లారీల దిగుమతుల జీరో దందాపై ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. బుగ్గ, ఖమ్మంతోగు వంటి ప్రాంతాల్లో లభించే వాగుల్లో లభ్యమయ్యే ఇసుకతో నిర్మాణాలు చేస్తున్నారని సమాచారం. అధికారులు తూతూ మంత్రపు పర్యవేక్షణతో చూసీ చూడనట్లు ఉండటంతో కోట్ల వ్యయంతో నిర్మించే నిర్మాణాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి!

కాంట్రాక్టర్ టెండర్ ద్వారా పొందిన పనులకు వర్క్ ఆర్డర్‌లో సూచించిన విధంగా అవసరమైన ఇసుకను మైనింగ్ శాఖ ద్వారా ప్రభుత్వానికి రాయల్టీలు చెల్లించి మైనింగ్ శాఖ ద్వారా ఇసుకను పొందాల్సి ఉంటుంది. కానీ ట్రక్కు 900 చొప్పున కాల్వల్లో లభ్యమయ్యే ఇసుకను తెప్పించుకు పనులు చేస్తున్నారని తెలుస్తోంది.

చిన్న సంప్ నిర్మాణాలకు తెచ్చారు..

నిత్యం పనులు పర్యవేక్షిస్తున్నాం. వాటర్ ట్యాంక్ వద్ద పక్కనే కొద్దిపాటి నీటి నిల్వ కోసం ఏర్పాటు చేసిన సంపు నిర్మాణానికి కంకర, ఇసుక తెప్పించినట్లు తెలిసింది. నాసిరకం కంకర, ఇసకను వినియోగిస్తే అలాంటి చర్యలను ఉపేక్షించం.

– డీఈ శ్రీనివాస్